

## ఏడాదికోరోజు పులి

నబీ సాయెబు పులివేషం చూసి తీరవల్సిందే. దసరా వస్తే పిల్లల సంబరాలు వొక యెత్తు, నబీ సాయెబు పులివేషం వొక యెత్తు.

దూరంగా డప్పులు.

టంకు టమా... టంకు టమా...

ఈలలు... చప్పట్లు

ఈలలు, చప్పట్లు

నబీ సాయెబు పులివేషం బయలుదేరింది. ఇళ్ళలో జనం పన్లొదిలేసి వీధిలోకొచ్చారు. పిల్ల, పాప భయపడి భోషాణాల క్రింద దాక్కున్నారు. డప్పులు పేలిపోతున్నాయి. ఢిక్ ఢిక్ ఢిక్... ఢిక్ ఢిక్ ఢిక్ పులి వీధిలోకొచ్చింది. వీరావేశంతో గెంతుతోంది. ఓ చేతిలో యెముక, మరో చేతిలో నిమ్మకాయ, డప్పులు ఫెళ ఫెళ మోగుతుంటే ఆట ఉధృతంగా సాగుతోంది. చూస్తున్నవాళ్ళకి నెత్తురు పొంగుతోంది. పులి బారలు బారలుగా వస్తోంది. వెంగు వెంగున గెంతుతోంది. పంజా విప్పి పైన పడుతోంది. ఎటు చూస్తే అటు గుంపు చెదిరిపోతోంది. పులికి భయపడి అందరూ దోవ యిస్తున్నారు.

నబీ సాయెబు జగదేకవీరుడిలా రొమ్ము విరుచుకు ముందుకు నడుస్తున్నాడు. జయజయ ధ్వానా

అమరావతి కథలు
సత్యంశంకరమంచి

ల్లాగా తప్పెట్లు మోగుతూంటే దేశాన్ని జయించి వచ్చిన చక్రవర్తిలాగా ఠీవిగా నడుస్తున్నాడు. ఇరుపక్కల మోగుతున్న డప్పులు, బారులు తీరిన జనం, ఈలలు చప్పట్లు కొడ్తూ డబ్బు లెగరేస్తుంటే అంత ఠీవితోటి ఆ డబ్బులందుకుని చెడ్డీలో దోపుకుంటున్నాడు. ఊరు ఊరంతా తన్నే చూస్తోంది. ఊరు ఊరంతా వీరవిహారం చేస్తున్నాడు నబీ సాయెబు. తతని గుండెల్లో గొప్పపొంగు! ఈ మనుషులందరికంటే తను గొప్పవాడినన్న భావం! డబ్బు, దస్కం, మేడలు, మిద్దెలు వున్న వీళ్ళందరికంటే అతీతుణ్ణే అన్న చూపు! విసిరేస్తున్న డబ్బులు అందుకుంటున్నా, చక్రవర్తి సామంతరాజులర్పించిన కానుకలు అంగీకరిస్తున్నప్పటి హుందా! అలా సూర్యుడు నడినెత్తికొచ్చేదాకా నబీ సాయెబు పులై, వీరుడై, గండరగండడై విజయ విహారం చేస్తున్నాడు.

అనుకున్న ప్రకారం డప్పులవాళ్ళకి డబ్బులిచ్చేసి వాకిట్లో అడుగుపెట్టేసరికి నబీ సాయెబు స్వరూపం పూర్తిగా మారిపోయింది. బేలబేలగా చూస్తూ నడుం వంగిపోగా బిక్కు బిక్కు మంటూ అడుగులో అడుగేసుకుంటూ వచ్చాడు. భార్య అమీనాబీని చూస్తే చెడ్డ వొణుకు నబీ సాయెబుకు.

"డబ్బులెన్ని దొరికాయి" ఉరిమినట్టడింది అమీనాబీ.

మాట నాలిక దాటి బయటకు రాలేదు నబీ సాయెబుకు. చిల్లరంతా పెళ్ళాం దోసిట్లో పోశాడు.

"దొడ్లో కెళ్ళి కిరసనాయిలు పెట్టి కడుక్కో" అంది అమీనాబీ.

పులి పిల్లిలా దొడ్లోకి జారుకుంది. పెళ్ళాం వాళ్ళ తోమలేదు. ఓ మంచి మాట మాట్లాడలేదు. కష్టపడ్డావని మెచ్చుకోలేదు. తన్ను తాను తిట్టుకున్నాడు. కుళ్ళి కుళ్ళి బాధపడ్డాడు. ఒక్క పెళ్ళామే కాదు, ఊళ్ళో తనని ఎవరూ మనిషిగా గుర్తించరు. కూలి పని కూడా ఇవ్వరు. వారానికో, నెలకో చాటింపు వేయడానికి, 'తాషా' కొట్టడానికి పిలుస్తారు. అంతకు మించి తనను మనిషిగా కూడా గుర్తించరు. అందుకే నబీ సాయెబుకు జనమంటే కసి, కోపం.

దసరాలో ఈ ఒక్కరోజే ఇష్టం.

ఈ నాలుగు గంటలే ప్రాణం.

ఈ ఒక్క రోజు కోసం, ఈ నాలుగు గంటల కోసం తను సంవత్సరమంతా ఎదురుచూస్తాడు. ఈ నాలుగు గంటలు తను పులి, వీరాధివీరుడు. మళ్ళీ సంవత్సరం తరువాత తన బ్రతుకు, ఆ రోజు కోసం నిరీక్షణ.

ఊళ్ళో జనం కూడా నబీ సాయెబు పులి వేషం కోసం ఎదురు చూసేవారు. ఆ రాత్రి అన్నం తినేవాడు కాదు. తెల్లవారుఝామునే లేచి రంగులు

### ఆవేశం

ధమనుల్లో సిరల్లో
విరామ మెరుగక యుగాలుగా
ప్రవహిస్తున్న ఆవేశాలకు
బుద్ధి కవాటాలు
బ్రేకులేస్తున్నా
గుండె అవిశ్రాంతంగా
ఆవేశాలను పంపు చేస్తూనే వుంది!

— యండపల్లె శ్రీనివాసరెడ్డి

పూసుకునేవాడు. వంగిపోయిన నడుం బాణంలా బిగిసేది. కళ్ళల్లోకి నెత్తురు తన్నుకొచ్చేది. శరీరం పొంగిపోయేది. దేహం వీరావేశంతో వూగిపోయేది. ఊరు, వాడ విలయ తాండవం చేసేవాడు. తాండవం పెరిగినకొద్దీ తప్పెట్ల మోతలు, ఈలలు హెచ్చేవి. పులి వేషం అయిపోయిన తరువాత కూడా ఎన్ని రోజులు చెప్పుకునేవారో.

మర్నాడు మళ్ళీ మామూలు నబీసాయెబే. బిక్కు బిక్కుమంటూ బీడీలు చుట్టుకునేవాడు. పెళ్ళాంచేత చివాట్లు తినేవాడు. గంజి తాగి పడుకుని రాత్రిళ్ళు పులి వేషం గురించి సంవత్సరమంతా కలలు కనేవాడు.

నబీ సాయెబు పెద్దవాడైపోయాడు. వెనకటిలా పులి వేషం కట్టలేకపోతున్నాడు. కుర్రకారు వేషాలు కడ్తుంటే తను వేషం వేసుకోలేకపోయినా తప్పెట్ల కనువుగా తనూ చిందు వేసేవాడు. కాని, ఆ చిందులో చురుకు లేదు. కళ్ళల్లో వేడి లేదు. అలసిపోయి, ఊరేగింపు సగంలోనే ఆగిపోయి కుమిలిపోయేవాడు.

కొంత కాలానికి ఆపాటి కూడా వీధిలోకి రాలేక కుక్కి మంచంలోనే పడుకున్నాడు. మళ్ళీ దసరా వచ్చింది. దూరంగా డప్పుల మోత. ఈలలు,

ముత్యాలవాన

చప్పట్లు... మంచంలో పడున్న నబీ సాయెబు వొళ్ళు పొంగుతోంది.

టంకు టమ... టంకు టమ...

కాళ్ళూ, చేతులూ లయగా వూపుతున్నాడు నబీ సాయెబు.

ఢిక్ ఢిక్ ఢిక్... ఢిక్ ఢిక్ ఢిక్

మంచంలోనే పులైపోతున్నాడు.

కళ్ళవెంట ధారలుగా కన్నీళ్ళు.

రోజూ తిట్టిపోసే అమీనాబీకి చిక్కి శల్యమై, పులైపోవాలని తపన పడుతున్న మొగుణ్ణి చూసింది. వున్నట్టుండి అమీనాబీకి దుఃఖం వచ్చింది. మొగుడి దగ్గరకొచ్చి ఆడిస్తున్న చేతుల్ని ఆప్యాయంగా పట్టుకుని "నాలయ్యా! ఆడినంత కాలం ఆడావు. నీ ఆట అయిపోయిందయ్యా, నీరస పడతావయ్యా" అంటూ ప్రేమగా చూసింది. నబీ సాయెబు ఇది నిజమా, కల అని బిత్తరపోయి భార్యవైపు చూశాడు. భార్య కళ్ళల్లో కూడా కన్నీళ్ళు.

నబీ సాయెబు భార్య కన్నీళ్ళు తుడుస్తూ అన్నాడు "ఇంత మంచిమాట జల్మలో ఎప్పుడూ అన్లేదు గదే. ఇంత సుకమైన మాట యెనకనుంటే ఏడాది కొక్క రోజేందే, జల్మంతా పులైపోయేవాణ్ని గదే."